ఇద్దరిని బలిగొన్న ఈత సరదా!

నాగులచవితితో రెండు కుటుంబాల్లో విషాదం

సారిపల్లి సమీపంలో చంపావతిలో పడి ఇద్దరు మృతి

విశాలాంధ్ర-నెల్లిమర్ల: నాగుల చవితి రోజు రెండు కుటుం బాలలో విషాదం నింపింది. విజయ నగరం పట్టణ పరిధి అద్దెపల్లి వీధికి చెందిన వారు నాగులచవితి సందర్భంగా పుట్టలో పాలుపోయడానికి సారిపల్లి ఇండస్ట్రియల్ ఏరియా సమీపంలోని చంపావతి నది ఒడ్డుకు శనివారం వెళ్లారు. నాగులు చవితి పూజలు పూర్తయిన తరువాత సరదాగా నదిలో స్నానం చేసేందుకు వనమాలి సతీష్ కుమార్(21), సత్య వీరవెంకట సాయి హర్షవర్ధన్(14) దిగారు. వీరికి ఈత రాకపోవడంతో లోతుగా ఉండడంతో మునిగిపోయి చనిపోయారు. కుటుంబ సభ్యులు రక్షించడానికి ప్రయ త్నించినా ఫలితం లేకుండాపోయింది. కుటుంబ సభ్యుల ముందే విగతజీవులుగా మారారు. దీంతో ఆ రెండు కుటుంబాలు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. నెల్లిమర్ల ఎస్ఐ నారాయణరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టి. బూర్జివలస లో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

విశాలాంధ్ర-దత్తిరాజేరు: మండలం లో గల టి.బూర్జివలస గ్రామంలో సర్పంచ్ మంత్రి క్రాంతికుమార్ శనివారం గ్రామంలో ఉన్న ముదే చెరువు నుండి మొదలుకొని 800 మీటర్ల సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఈ రోడ్డు వల్ల చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు రవాణా సదుపాయం కలుగుతుం దన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

నియోజకవర్గ సోషల్ మీడియా కో-కన్వీనర్ గా శేషాపు ప్రకాష్

విశాలాంధ్ర-గుర్ల: మండలంలో వల్లపురం గ్రామానికి కేంద్రానికి శేషాపు ప్రకాష్ వైసీపీ చీపురుపల్లి నియోజకవర్గం సోషల్ మీడియా కో-కన్వీనర్గా నియామకం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ సోషల్ మీడియా కో-కన్వీనర్ గా అవకాశం కల్పించిన ఎంపీపీ పొట్నూరు ప్రమీల, వైఎస్సార్సీపీ నాయకులు పొట్నూరు సన్యాసి నాయుడు, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె వి సూర్యనారాయణ రాజు, జెడ్పీటీసీ అప్పలనాయుడు వైసీపీ నాయకులకు కృతజ్ఞత తెలిపారు. మండల నాయకులు ఆలోచన విధానం మేరకు నడుస్తూ వైసీపీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. టీడీపీ, జనసేనా నాయకులు తీరును ఎండ గడుతూ, వైఎస్సార్సీపీ మండల, జిల్లా స్థాయి నాయకులు చేపడుతున్న అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు ప్రజలకు సోషల్ మీడియా ద్వారా తెలియజేస్తానని అన్నారు.

తారాపురంలో కోనేరు నీటిని వినియోగంలోకి తెచ్చిన అయ్యప్ప స్వాములు

విశాలాంధ్ర-రామభద్రపురం: మండలంలోని తారాపురం గ్రామం లో ఊరు చివరలో ఉన్న మంచినీటి కోనేరును అయ్యప్ప స్వాములు శనివారం శుద్ధి చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా ఈ కోనేరు గ్రామస్తులు వినియోగించడం లేదు. స్వాములంతా కలిసి మెట్లపై ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. అలాగే కోనేరులో బ్లీచింగ్ వేసి పిచికారి చేశారు. ఈ కోనేరును కార్తీకమాసంలో గ్రామస్తులందరూ ఉప యోగించుకొని కార్తీక్ స్నానాలు మరియు దీపారాధన చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి

జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

సమావేశంలో మాట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్

విశాలాంధ్ర-విజయనగరం: ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను గుర్తించి, వారిని అన్నివిధాలా ప్రోత్స హించాలని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ఆదేశించారు. జిల్లా పరిశ్రమలు మరియు ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం కలెక్టరేట్ సమావేశమందిరంలో శనివారం జరిగింది. జిల్లాలో పరిశ్రమల స్థాపనకు ఉన్న అవకాశాలు, వచ్చిన దరఖాస్తులు, పారిశ్రామికవాడల్లో మౌలిక సదుపాయాల కల్పన, మహిళా పారిశ్రామకవాడ ఏర్పాటు తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ, ఔత్సాహిక పారి శ్రామిక వేత్తలను గుర్తించేందుకు వివిధ ప్రభుత్వ సంక్షేమ శాఖలు కూడా కృషి చేయాలన్నారు. బిసి, ఎస్సి, ఎస్టి, మైనారిటీ సంక్షేమశాఖలు తమ పరిధిలోని ఔత్సాహికులను గుర్తించి, వారికి పరిశ్రమలస్థాపనపై అవగాహన కల్పించాలని సూచించారు. పిఎంఇజిపి పథకం క్రింద పరిశ్రమల స్థాపనకు 300 పైగా ధరఖాస్తులు రాగా, కేవలం 63 మాత్రమే గ్రౌండింగ్ చేయడం పట్ల అసంతృప్తిని వ్యక్తం చేశారు. వచ్చినవాటన్నిటికీ అనుమతులు, రుణాలను త్వరగా మంజూరు చేసి, పరిశ్రమలను స్థాపించేవిధంగా కృషి చేయాలని సూచించారు. కొత్తవలస పారిశ్రామిక వాడలో మౌలిక సదుపాయాల కల్పన పనులు వేగవంతం చేయాలన్నారు. జిల్లాలో రైతు ఉత్పత్తి సంఘాల ద్వారా వ్యవసాయాధారిత పరిశ్రమల స్థాపనపై దృష్టి పెట్టాలని సూచించారు. మొక్కజొన్న, జీడి, మామిడి, ఆయిల్ పామ్, వేరుశనగ ప్రాసెసింగ్ పరిశ్రమలను, నూనె తయారీ పరిశ్రమలను ఏర్పాటు చేయడానికి జిల్లాలో ఎక్కువ అవకాశాలు ఉన్నాయన్నారు. భీమాలి సమీపంలో కోల్డ్ స్టోరేజ్ను ఏర్పాటు చేయడం ద్వారా, తాండ్ర తయారీదారులకు కూడా ఉపయోగం ఉంటుందన్నారు. ఇసుక కొరత రాకుండా, రాక్ శాండ్ యూనిట్లను ఏర్పాటు చేయడానికి ప్రయత్నం చేయాలన్నారు. పరిశ్రమల స్థాపనలో డిఆర్డిఏ, మెప్మా కీలక పాత్రపోషించాలని కోరారు. మైనా రిటీలకు మంజూరైన ఎండియు వాహనాన్ని మూడు రోజుల్లో గ్రౌండింగ్ అయ్యేలా చూడాలని, మైనారిటీ శాఖను జెసి ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమలశాఖ మేనేజర్ పాపారావు, డిడి నాగేశ్వరరావు, డిఆర్డిఏ పిడి ఎ.కల్యాణ చక్రవర్తి, వ్యవసాయశాఖ జెడి తారకరామారావు, ఉద్యానశాఖ డిడి జమదగ్ని, మత్స్యశాఖ డిడి నిర్మలా కుమారి, గ్రౌండ్ వాటర్ డిడి దుర్గాప్రసాద్, కాలుష్య నియంత్రణశాఖ ఇఇ సుదర్శన్, ఎల్డిఎం శ్రీనివాసరావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం

జిల్లా ఎస్పీ దీపికాపాటిల్

పోలీస్ స్టేషన్ను తనిఖీ చేసిన ఎస్పీ దీపికా పాటిల్

విశాలాంధ్ర-గజపతినగరం : జిల్లాలో గత ఏడాది కన్నా రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పట్టాయని జిల్లా ఎస్పీ ఎం.దీపికాపాటిల్ అన్నారు. శనివారం గజపతి నగరం పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది జులై నెల వరకు రోడ్డు ప్రమాదాల శాతాన్ని పరిశీలించగా గత ఏడాది కన్నా 20 శాతం ప్రమాదాలు తగ్గాయన్నారు. ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న రోడ్లు ప్రమాదాలను తమ సిబ్బంది తగ్గించగలిగారు అన్నారు. 11 పోలీస్స్టేషన్ల పరిధి లోనే గంజాయి సరఫరా జరుగుతున్నట్లు గుర్తించామని, ఇందుకుగాను ప్రత్యేక టాస్క్ ఫోర్స్ టీమును ఏర్పాటు చేశామన్నారు. దీనివల్ల మంచి ఫలితాలు వస్తాయని గంజాయి అమ్మకం దారులు, కొనుగోలుదారులపై కేసులు నమోదు చేస్తున్నా మన్నారు. గంజాయితో పట్టు బడే 18 నుండి 22 సంవత్సరాల యువకులపై కూడా కేసులు పెడుతూ ఉన్నామని చెప్పారు. సైబర్నేరాలపై ప్రత్యేక దృష్టిస్తున్నా మని తెలిపారు. రుణయాప్ లపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. ఆన్లైన్ చెల్లింపులు పట్ల అప్రమత్తంగా ఉండాలని మీ అకౌంట్లలో డబ్బు మాయమైనా విషయం తెలపాలని కోరారు. మోసపోయిన 24గంటల్లో తమకు సమాచారం 19 30 నెంబర్ కు కాల్ చేస్తే బాధ్యతలకు మేలుచేసే అవకాశం ఉంటుందని అన్నారు. జిల్లాలో 3600 పెండింగ్ కేసులు ఉన్నట్లు తెలిపారు డ్రంక్ అండ్ డ్రైవ్, త్రిబుల్ డ్రైవింగ్. మైనర్లు డ్రైవిం గ్ లపై కేసులు నమోదు చేస్తామని చెప్పారు. నిషేధిత క్రైని, గుట్కా అమ్మకం దారులపై కేసులు పెడుతున్న కోర్టులో వీగిపోతున్నా యని చెప్పారు అలాగే బస్సు అక్రమ రవాణా పై నిఘా ఉందన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్లో రికార్డుల నిర్వహణ సిబ్బంది పనితీరు కేసుల పురోగతి వంటి విషయాలను నిశితంగా పరిశీలించారు. అలాగే జైలు వార్డులు ఫ్యామిలీ కౌన్సిలింగ్ గదులను ఎస్పీ తనిఖీ చేశారు అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణను పరిశీలించారు ఈ కార్యక్రమానికి మహిళా పోలీసులు ఎస్పి దీపిక పాటిల్ కు స్వాగతం పలికారు అదే విధంగా వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బొబ్బిలి డిఎస్పి మోహన్ రావు సీఐ అప్పలనాయుడు ఎస్సై సిహెచ్ గంగరాజు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీరేది ?

జలజీవం మిషన్ ఎక్కడ?

పై కప్పు లేని వాటర్ ట్యాంక్ కు నీరు అందించే బోరు

విశాలాంధ్ర-భోగాపురం : జలజీవం మిషన్ ద్వారా ఇంటింటికి స్వచ్ఛమైన తాగునీరు అందించడానికి కోట్లాది రూపాయలు నిధులు ఖర్చు చేస్తున్నామని ప్రభుత్వం ఒకవైపు చెపుతుంటే, నిజానికి పల్లె ప్రజలు అపరిశుభ్రమైన నీటిని తాగి అనారోగ్యం పాలౌతున్నారు. మండలంలోని ముంజేరు పంచాయతీ మధుర గ్రామమైన జగయ్యపేటలో వాటర్ ట్యాంక్ నుండి వచ్చే హెచ్డిపి ఇ పైప్ కట్ అయ్యి రెండురోజులుగా గ్రామ ప్రజలు తాగునీటికి అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం పంచాయతీ దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదని, కనీసం గ్రామ ప్రజలకు ట్యాంకర్ ద్వారా తాగునీరు అందించలేదని గ్రామస్తులు ఆరోపించారు. ఇక్కడ మొదటి నుంచి అధికారులు, నాయకులెవరూ పట్టించుకోలేదని తెలిపారు. కిందటి నెలలో తాగునీటి ట్యాంక్ నుండి వస్తున్న నీటిలో పురుగులు వస్తున్నాయని గుర్తించి ముంజేరు పంచాయతీకి ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవటంతో గ్రామంలో యువకులు స్వయంగా తాగునీటి ట్యాంక్ ను శుభ్రపరచుకున్నారు. అలాగే వాటర్ ట్యాంక్ కు నీటిని సరఫరా చేసే బోర్ కు పై కప్పులేకపోవడం వల్ల వర్షపు నీరు బోరులోనికే పోతున్నందువల్ల నీరు కలుషితమౌతుందని దీనిపై పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని అన్నారు. కలుషిత నీటిని తాగడం వల్ల గ్రామ ప్రజలు అనారోగ్య బారిన పడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కాలువల నుంచి తీసిన చెత్తను 10 రోజుల వరకు తీసుకెళ్లటం లేదన్నారు. అలాగే గ్రామంలో అసలు పారిశుధ్యమే చేపట్టడం లేదని పంచాయతీకి ఫిర్యాదు చేసినా ఫలితం లేదని వాపోయారు. అయితే జగ్గయ్యపేట జనసేన పార్టీ నాయకులు వందనాల రమణ తన సొంత డబ్బులు పెట్టి గ్రామ ప్రజలకు గత రెండు రోజుల నుండి తాగునీరు అందిస్తున్నట్టు ఆ గ్రామ ప్రజలు చెప్పారు.

రైల్వే కారిడార్పై తగ్గేదేలే..!

- పట్టు వీడనంటున్న రైతులు..

- సర్వే చేసేందుకు రెవెన్యూ సన్నాహాలు

ప్రభుత్వ స్థలంలో సర్వే చేస్తున్న సిబ్బంది

విశాలాంధ్ర-జామి: మండలం లోని ఇప్పటి వరకు అనేక భూసమస్యలు వరుసగా తలెత్తుతున్నాయి. ఇప్పటికే జామి అగ్రహారం భూములు, తాండ్రంగి భూసమస్యలతో రెవెన్యూ, రైతులు ఇబ్బందులు పడు తున్నారు. ఇటీవల కాలంలో విశాఖ-రాయపూర్ జాతీయ రహదారి (గ్రీన్ఫీల్డ్హైవే) నిర్మాణంకు రైతులనుంచి భూసేకరణను అతికష్టం మీద రెవెన్యూ శాఖ పూర్తి చేసింది. అందరూ ఊపిరి పీల్చుకునే సమయంలో తాజాగా రైల్వే కారిడార్ నిర్మాణంకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందనే వార్త రావడంతో జామి పరిసర ప్రాంతాల రైతులకు కంటి నిండా నిద్ర కరువయింది. చివరకు గొడుకొమ్ము, కిర్ల, జెడీ వలస, జామి రెవెన్యూ మీదుగా వెంకటరాజుపాలెం, వెన్నె రెవెన్యూలలో ఉన్న పంట పొలాలలో ఈరైల్వే లైన్ నిర్మాణం జరుగుతుందని తెలుసుకున్న రైతులు అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. తమ జీవనాధారమైన భూమిని ఎలా కోల్పో తామని, వాటిని ఇచ్చేస్తే మాకు ఆత్మహత్యలే శరణ్యమని వాపోతున్నారు. ఎట్టి పరిస్థితిలోనూ భూములు వదులుకోమని తెగేసి చెబుతున్నారు. అందులో భాగంగా జిల్లా కలెక్టర్కు తమ ఆవేదనను వినతి రూపంలో అందజేసారు. అలాగే స్థానిక పంచాయతీ పెద్దలు ఆధ్వర్యంలో తీవ్రస్థాయిలో రాజకీయ ప్రయత్నాలు చేస్తు న్నారు. ఇదిలా వుండగా కొంత కాలం వరకు ఈరైల్వే కారిడార్ విషయంపై ఎటువంటి సమాచారం లేకపోవడంతో రెవెన్యూ అధికారులు మిన్నకున్నారు. రైతులు అడిగినా తమకేమీ తెలియదని చెప్పుకొచ్చారు. కానీ కొద్దిరోజుల క్రితం కారిడార్ నిర్మాణంపై ఉన్నతాధికారులనుంచి ఆదేశాలు రావడంతో రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగారు. ఈనేపథ్యంలో నిర్మాణంకు ముందుగా ప్రవేటు ఏజెన్సీలకు చెందిన ఇంజనీర్ల సహకారంతో భూసార పరీక్షలను చేస్తున్నారు. అయితే ఈ పరీక్షలకు స్థానిక జామి రైతులు అంగీకరించడంలేదు. సర్వేకు వచ్చిన సిబ్బందిని పనిచేయకుండానే తిరిగి పంపిస్తున్నారు. దీంతో ఉన్నతాధికారులనుంచి వత్తిడి పెరగడంతో రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగి ప్రభుత్వ స్థలాలలో ముందుగా భూసార పరీక్షలు జరిగేలా చూస్తున్నారు. అయితే ఈవ్యవహారంలో అటు రైతులు, ఇటు రెవెన్యూ సిబ్బంది వైరి వర్గాలుగా మారాయి. తాము తగ్గేది లేదని రైతులు చెబుతుండడంతో ఏం చేయాలో అనే ఆలోచనలో అధికారులు ఆలోచన చేస్తున్నారు. మరోవైపు జిల్లా కలెక్టర్ సూచన మేరకు జిరాయితీ రైతులు తమ భూమికి ల్యాండ్ కన్వర్షన్ నిమిత్తం రెవెన్యూ కార్యాలయానికి ధరఖాస్తులు పెట్టుకుంటున్నారు. ఏదిఏమైనా జిల్లా స్థాయి అధికారులు పూర్తి స్థాయిలో ఈసమస్యపై చర్చించాల్సిన అవసరం ఉందని పలువురు భావిస్తున్నారు.

మందుల వాడకంపై అవగాహన

విశాలాంధ్ర-విజయనగరం క్రైమ్: విశాఖ జిల్లా ఆనందపురం మండలానికి చెందిన విశ్వనాథ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యుటికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రం లో గల సర్వజన ఆస్పత్రిలో ప్రజలకు మందులు వాడకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆ కళాశాల విద్యార్థులు మరియు సిబ్బంది ప్రజలకు మందులు వాడకంపై పలు సూచనలు చేశారు. గుర్తింపు పొందిన డాక్టర్ల సలహా ప్రకారం ప్రభుత్వ అనుమతి ఉన్న దుకాణం నుంచి మందులు తీసుకోవాలని, మందులు చీటీలో ఉన్నవి, దుకాణం వారు ఇచ్చినవి సరి చూసుకోవాలని, మందులను ఇంట్లో ఉంచేటప్పుడు తగిన స్థలంలో భద్రపరచాలని, ప్రభుత్వ అనుమతి లేని దుకాణాల నుంచి లేదా ఆన్లైన్లో మందులను కొనుగోలు చేయరాదని, అనారోగ్యం వచ్చేటప్పుడు సొంత వైద్యం చేయకుండా వైద్యుల పర్యవేక్షణలో తీసుకున్న మందులు వాడటం శ్రేయస్కరమని, మందులు వాడకం పూర్తయ్యేంతవరకు డాక్టర్ రాసిచ్చిన మందులు చీటీని భద్రపరచాలని,కంటిలో వాడే చుక్కల మందులు లేదా ఆయింట్మెంట్లను తెరిచిన నెల రోజుల్లో గా వాడాలని, గర్భం ధరించాలని ఆలోచనలో ఉన్నవారు వైద్యులు సలహా తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆ కళాశాల ప్రిన్సిపాల్ పి. ఉమాదేవి, సిబ్బంది బి.రమాదేవి, ఎన్. హేమలత, శ్రీనివాసరావు, 3వ బీఫామ్ విద్యార్థులు పాల్గొన్నారు.

31న జాతీయ సమైక్యతా దినోత్సవ రన్

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: జాతీయ సమైక్యతా దినోత్సవ రన్ (రాష్ట్రీయ ఎక్తా దివాస్) ను 31వ తేదీన జరిగే నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడల చీఫ్ కోచ్ ఎస్. వేంకటేశ్వర రావు తెలిపారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా జాతీయ సమైక్యతా దినోత్సవ రన్ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జరుగుతుందని ఆయన అన్నారు. సోమవారం ఉదయం 8 గంటలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఇన్ ఛార్జ్ జిల్లా కలెక్టర్ ప్రారంభిస్తారని ఆయన చెప్పారు. జూనియర్ కళాశాల మైదానం నుండి జిల్లా కలెక్టర్ కార్యాలయం, ఐటిడిఏ పెట్రోల్ బంక్, ఆర్టీసీ కాంప్లెక్స్, ప్రభుత్వ కార్యాలయ భవనాల సముదాయం (ఆర్.సి.ఎం) వరకు సాగుతుందని వివరించారు. ఆర్.సి.ఎం వద్ద ముఖ్య అతిథులు ప్రసంగాలతో రన్ ముగుస్తుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజలు, విద్యార్థులు, క్రీడాకారులు, ఉద్యోగులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నష్టం చేకూర్చే కార్మిక చట్టాలను రద్దు చేయాలి

నిరసన తెలిపిన మున్సిపల్ వర్కర్లు & ఎంప్లాయిస్ ఫెడరేషన్

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: కార్మికులను నష్టం చేకూర్చే కార్మిక చట్టాలను రద్దుచేయాలని కోరుతూ స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిహెచ్ సింహాచలం , గొర్లెల వెంకటరమణ, రెడ్డి వేణు మాట్లాడుతూ మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు ఇంజనీరింగ్ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీ నిలబెట్టు కోవాలని, కార్మికులను పర్మినెంట్ చేయాలని, కార్మికులకు 26,000 కనీస వేతనం ఇవ్వాలని గన్బూట్లు, సబ్బులు, నూనె ప్రతి నెల ఇవ్వాలని, ఉద్యోగ భద్రత, రిటైర్మెంట్ బెనిఫిట్ పిల్లలకు వారసత్వం లాంటి సమస్యలు పరిష్కారం చేసి మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాల వల్ల కార్మిక చట్టాలు కార్మికుల హక్కులు కాలరాయపడుతున్నాయని అందుకనే 44 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడులుగా తీసుకువచ్చి పనిభారం పెంచు తున్నారని హక్కులు లేకుండా చేస్తున్నారని అందుకని కార్మికుల హక్కులు రక్షణ కోసం కార్మికులందరూ ఐక్యంగా పోరాడాలని చెప్పారు. అనంతరం పట్టణ నూతన కమిటీ ఎన్నుకోవడం జరిగింది. గౌరవ అధ్యక్షులుగా గొర్లె వెంకటరమణ. అధ్యక్షులుగా సిహెచ్ సింహాచలం కార్యదర్శిగా ఎన్ మల్లేశు కోశాధికారిగా ఎన్.శంకర్రావు, సహాయ కార్యదర్శిగా పి వరదరాజు. ఉపాధ్యక్షులుగా ఎం.శివ. కమిటీ సభ్యులుగా ఎం.శ్రీను సత్యరాజు. ఎం.శ్రీను. జి.గుంపుస్వామి. చి.గంగులు. ఎన్ నిర్మల, పి.సంతోష్లను ఎన్నుకున్నారు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

విశాలాంధ్ర-బెలగాం: కారు ఢీకొని వ్యక్తికి గాయాలైన సంఘటన శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. పార్వతీపురం జిల్లా ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసుల వివరాలివి. సీతానగరం మండలం సూరంపేట గ్రామానికి చెందిన బర్ల గంగయ్య పార్వతీపురం మండలం నర్సిపురం గ్రామం నుండి చేపలు పట్టుకొని బైక్పై తన గ్రామం వస్తుండగా జన హిత కాలేజీ టేకుతోట సమీపంలో సీతానగరం వైపు నుండి పార్వతీపురం వస్తున్న కారు బైక్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో గంగయ్యకు గాయాలయ్యాయి. ఆ మార్గంలో వెళుతున్న అతని స్నేహితులు గమనించి వెంటనే ఆటోలో పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించారు. ఔట్పోస్టు పోలీసులు వివరాలు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రభుత్వ దృష్టికి శాలివాహన కులస్తుల సమస్యలు

టిడ్కో రాష్ట్ర చైర్మన్ ప్రసన్నకుమార్

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్: శాలివాహన కులస్తుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని టిడ్కో రాష్ట్ర చైర్మన్ జమ్మన ప్రసన్న కుమార్ అన్నారు. శనివారం పార్వతీపురంలో శాలివాహన కులస్తుల సమస్యలపై ప్రసన్నకుమార్ కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శాలివాహన కులస్తులు మాట్లాడుతూ జీవనోపాధికి అవసరమైన ప్రభుత్వ సహాయం అందించాలన్నారు. శాలివాహనుల జీవనాధారంగా చేస్తున్న వృత్తికి ప్రస్తుతం అనుసరిస్తున్న పద్ధతులలో మనుగడ కష్టతరంగా ఉండటం వల్ల నేటి అవసరాలకు అనుగుణంగా అవసరమైన ఎలక్ట్రిక్ పవర్తో నడిచే యంత్రాలను సమకూర్చి వారి జీవనోపాధికి, ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం నుండి సహాయమందించమని కోరుతూ రాష్ట్ర సంఘం తరుపున ఛైర్మెన్ కి విజ్ఞప్తి చేశామన్నారు. ఈ ప్రభుత్వ ఆధ్వర్యంలో అన్నివర్గాల వారి అభివృద్ధి జరుగుతుందని కనుక మీ యొక్క సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకునివెళ్లి తగు న్యాయం వీలైనంత త్వరలో చేస్తానని వారికి హామీ ఇచ్చారు.

రైలు ఢీకొని మహిళ మృతి

విశాలాంధ్ర-బెలగాం: గుర్తు తెలియని రైలు ఢీకొని మహిళ మృతి చెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. పార్వతీపురం రైల్వే పోలీసుల వివరాలివి. కొమరాడ మండలం విక్రాంపురం రైల్వే గేటుకు అనుకోని గుమడ పార్వతీపురం రైల్వేస్టేషన్ల మధ్య అఫ్లైనులో ఓ మహిళను గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందిందని గ్యాంగ్ మ్యాన్ సమాచారం మేరకు రైల్వే పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని విచారించగా మృతురాలు విక్రాంపురం పరిసర ప్రాంతాలలో బిక్షాటన చేసుకుంటుందని, ఈమె వయస్సు సుమారు 50సంవత్సరాలు ఉంటుందని, ఒడిషా రాష్ట్రానికి చెందిన ఈ మహిళ ఇక్కడ ఉంటుందని, ఈమె పేరు, ఊరు తెలియదని, ఒరియా భాష తప్ప మరే భాష తెలియదన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించి మార్చ్యురీ లో భద్రపరిచినట్లు పార్వతీపురం రైల్వే పోలీసు హెడ్ కానిస్టేబుల్ రత్నకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

ఐసిడిఎస్ జిల్లా పీడీ వరహాలు



విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్: పౌష్టికాహారంతోనే ఆరోగ్యం కలుగుతుందని ఐసిడిఎస్ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ జి వరహాలు అన్నారు. శనివారం మండలంలోని పెద్ద బండపల్లి అంగన్వాడి కేంద్రంలో గర్భిణీలకు, బాలింతలకు, పౌష్టికాహారం, పరిశుభ్రత శ్రీమంతాలు వంటి కార్యక్రమాలను సూపర్వైజర్ బంగారమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రాజెక్ట్ డైరెక్టర్ వరహాలు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రభుత్వము అంగన్వాడి కేంద్రం ద్వారా గర్భిణీలకు బాలింతలకు పౌష్టికారాన్ని అందిస్తుందని తప్పనిసరిగా వినియోగించుకోవాలని అన్నారు. దీనివలన సుఖాంతమైన ప్రసవంతో పాటు బాలింత సమయాల్లో కూడా ఆరోగ్యవంతంగా ఉంటారని తెలిపారు ముఖ్యంగా పరిసర పరిశుభ్రత వ్యక్తిగా వ్యక్తిగత పరిశుభ్రత ఆరోగ్య సూత్రాలు వైద్య పరీక్షలు వైద్యులు ఇచ్చిన సూచనలు సలహాలను సలహాలు ఎప్పటికప్పుడు పాటించాలని అన్నారు .అంగన్వాడి వైద్య సిబ్బంది సమాన మయంతో ఎప్పటికప్పుడు బాలింతలను గర్భిణీ గర్భిణీలను పరిశీలన చేసి వారి ఆరోగ్యం తెలిపారు. ఇటువంటి అనారోగ్యం సంభవించిన తక్షణమే ఆసుపత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. బాలింతలు పిల్లలకు ఆరు నెలల వరకు తల్లిపాలనే అందజేయాలని దీనివలన బిడ్డ ఆరుగవంతంగా ఉంటుందని వ్యాధినిరోధక శక్తి ఎక్కువగా కలుగుతుందని తెలిపారు. డబ్బా పాలు వలన బిడ్డకు అనారోగ్యం కలుగుతుందని దీన్ని ఎవరు తీసుకోరాదని తెలిపారు అంగన్వాడి కేంద్రాలు పిల్లలకు ప్రీస్కూల్ విద్యను మరింత చేరువయ్యే విధంగా ఆటపాటలతో బోధించాలని తెలిపారు. అదే విధంగా రికార్డులు ఎప్పటికప్పుడు పూర్తి చేసి ఉంచాలని ఉన్నతాధికారుల తనిఖీలకు ఎటువంటి ఆటంకలకుండా చూడాలన్నారు. కార్యాలయం నుండి వచ్చిన సమాచారంను అందించాలని తెలిపారు అద్దె భవనాల్లో ఉన్న అంగన్వాడి కేంద్రాలకు అవకాశం ఉన్నంతవరకు భవనాలను నిర్మించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు సహాయకులు బాలింతలు గర్భిణీలు పిల్లలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై నియంత్రత్వ ధోరణి : మాజీ ఎమ్మెల్యే

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్ : ఉపాధ్యాయులపై వైసిపి ప్రభుత్వం నియంత్రత్వ ధోరణి అవలంభిస్తుందని మాజీ ఎమ్మెల్యే టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ బొబ్బిలి చిరంజీవులు అన్నారు. శనివారం ఈ సందర్భంగా ఆయన విలేకరుల తో మాట్లాడుతూ ఉపాధ్యాయులకు పాఠశాలకు హాజరయ్యేందుకు ముఖ హాజరును ప్రవేశపెట్టిందని అన్నారు. ముఖచిత్ర హాజరు జారీ చేసేటప్పుడు ఒకటి రెండు దఫ హాజరు కాకపోయినా ఇబ్బందులేదని నాలుగైదుడపాలుగా హాజరుకాకపోతే ఒక సెలవు దినముగా పరిగణించడం జరుగుతుందని తెలిపారు. అయితే ఇటీవల పలనాడు లో 9 మంది ఉపాధ్యాయు నిమిషం ఆలస్యమైనందుకు సోకాజు నోటీసులు ఇవ్వడాన్ని తీవ్రంగా టీడీపీ తరఫున ఖండిస్తున్నామని తెలిపారు ఇది ముమ్మాటికీ నిరంకుసత్వ పాలనకు నిదర్శనమన్నారు. సాంకేతిక లోపాలు ఉన్నప్పుడు ఎవరు ఏ విధమైన చర్యలు తీసుకోగలరని పాఠశాలకు ఉపాధ్యాయులు హాజరు అయినప్పటికీ అదే సమయంలో హాజరు నమోదు కానప్పుడు ఎలా నోటీసులు జారీ చేస్తారని తెలిపారు ఉపాధ్యాయులపై కక్షాదింపు చర్యలు చేపట్టందని నిబంధనలకు విరుద్ధంగా నోటీసులు జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. ముఖ హాజరు విధానాన్ని ఉపాధ్యాయులు ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా ఖండించినప్పటికీ ప్రభుత్వం పెడచెవిని పెట్టిందని ఇప్పుడు అనేక విధాలుగా ఇబ్బందులు పెట్టడం దారుణమన్నారు. ఉపాధ్యాయులు వర్గాల్లో సోకజ్ నోటీసులు పై తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందని అన్నారు.

రెండు బైక్లు ఢీ : ముగ్గురికి గాయాలు

విశాలాంధ్ర-బెలగాం: మోటార్ సైకిళ్ళు ఢీకొని ఇద్దరికి గాయాలైన సంఘటన శనివారం చోటుచేసుకుంది. సీతానగరం మండలం బుడ్డిపేట మలుపు వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయలు కాగా, మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. పార్వతీపురం జిల్లా ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సీతానగరం మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఎం. భాను, డి. హరి మోటార్ సైకిల్ పై స్వగ్రామానికి వెళుతుండగా బలిజిపేట మండలం అజ్జాడకు చెందిన చింతాడ దాసు, చిన్నారావులు మోటార్ సైకిల్ పై సీతానగరం మండల కేంద్రానికి వస్తుండగా బుడ్డిపేట గ్రామం మలుపు వద్ద ఎదురెదురుగా రెండు బైక్లు వచ్చి ఢీకొనడంతో దాసు, చిన్నారావులకు గాయాల య్యాయి. స్థానికులు సీతానగరం పీహెచ్సీకి తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించారు. వీరిలో దాసు పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం విజయనగరం జిల్లా కేంద్ర ఆసుపత్రికి రిఫర్ చేశారు. ఔట్ పోస్టు పోలీసులు వివరాలు నమోదు చేసినట్లు తెలిపారు.

బైక్ ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర-బెలగాం : మోటార్ సైకిల్ ను నేర్చుకుంటున్న యువకుడు అదుపు అదుపుతప్పి కిందపడిపోవడంతో అతడికి తీవ్ర గాయాలై అపస్మారక స్థితికి చేరుకున్న సంఘటన శనివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. పార్వతీపురం జిల్లా ఆసుపత్రి ఔట్పోస్టు పోలీసులు, స్నేహితుడి వివరాలివి.. పార్వతీపురం మండలం నర్సిపురం గ్రామానికి చెందిన బాలి రాజేష్, బాలి రఘు శనివారం మధ్యాహ్నం కాపువీధిలోని తమ స్నేహితుల మోటార్ సైకిల్ ను తీసుకున్నారు. నాకు డ్రైవింగ్ రాదు కదా నువ్వు వెనుక కూర్చో నేను బండి డ్రైవ్ చేస్తానని రాజేష్ బైక్ను తీసుకొని రఘు వెనుక కూర్చొనగా ఒక్కసారిగా ఏక్సిలేటర్ ను రెయిజ్ చేయడంతో ఒకేసారి పైకి ఎగిరి రాజేష్ కిందపడ్డాడు. వెనుక కూర్చున్న రఘు మోటార్ సైకిల్ ను కంట్రోల్ చేయ దానికి ప్రయత్నించినా అవలేదు. ఈ ఘటనలో రాజేష్కు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే ఆటోలో పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం నిమిత్తం విశాఖపట్నం రిఫర్చేశారు. ఔట్ పోస్టు పోలీసులు వివరాలు నమోదు చేసినట్లు తెలిపారు.

ఎస్బీఐ, యూనియన్ బ్యాంకుల ఖాతాల నుండి పలువురి డబ్బులు మాయం!

లబోదిబోమంటున్న ఖాతాదారులు



విశాలాంధ్ర-సీతానగరం: గతవారం రోజులుగా సీతానగరం, బలిజిపేట బొబ్బిలి పరిసరప్రాంతాల్లోని ఎస్బీఐ, యూనియన్ బ్యాంకు ఖాతాదారుల డబ్బులు మాయమవుతుండటాన్ని గురు, శుక్రవారాల్లో గుర్తించిన పలువురు ఒక్కసారిగా లబోదిబో మంటున్నారు. దీనిపై బలిజిపేట, సీతానగరం, బొబ్బిలిలోని బ్యాంకులకు, పోలీస్స్టేషన్లకు వెళ్లి బాధితులు ఫిర్యాదులు చేశారని తెలుస్తోంది. ఒక్కొక ఖాతానుండి మూడు విడతలుగా గుర్తు తెలియని వ్యక్తులు డబ్బులు తీయడంతో వీరంతా లబోదిబోమంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలువురు ఉద్యోగుల డబ్బులు సైతం ఈ గుర్తు తెలియని వ్యక్తులు తీయడంతో వారు కూడా ఆశ్చర్యపోతున్నారు. శని, ఆదివారాలలో సెలవు రోజున ఎక్కువమంది డబ్బులు కొందరు వ్యక్తులు డ్రాచేసినట్లు కొంతమందికి చరవాణి సందేశాలు రాగా మరి కొంతమంది బ్యాంకుకు వెళ్లి బ్యాంకు పాస్ పుస్తకాలు చూడగా డబ్బులు తీసినట్లు ఉండటంతో వారంతా ఖంగుతిన్నారు. సీతానగరం మండలంలోని సుంకరివీధికి చెందిన పిన్నింటి రామారావు తన యూనియన్ బ్యాంకు ఖాతానుంచి గతవారంరోజులుగా మూడువిడతలుగా 18వేల రూపాయలను గుర్తు తెలియని వ్యక్తులు తీసివేశారు. శుక్రవారం అతను ఫోన్ పే ద్వారా డబ్బులను అతని స్నేహితుడికి పంపించాలని చూడగా డబ్బులులేనట్లు గుర్తించి వెంటనే బ్యాంకుకు వెళ్లిచూడగా డబ్బులు ఎవరో తీశారని తెలిసింది. దీంతో ఆయన పోలీస్స్టేషన్ కు, బ్యాంకుకు వెళ్లి పిర్యాదుచేశారు. సీతానగరం మండలంలోని మరొకరుకూడా తన డబ్బులు ఆరువేల రూపాయలు ఎవరో తీశారని బ్యాంకుకు వచ్చి తెలిపినట్లు స్థానిక యూనియన్ బ్యాంకు బీఎం చెప్పారు. బలిజిపేట మండలంలోని తుమరాడ గ్రామా నికి చెందిన ఎన్ తాతబాబు స్టేట్ బ్యాంకు ఖాతా నుండి ఈనెల 25న ఒకసారి 2వేలు, మరోసారి 10 వేలు, 26న యూనియన్ బ్యాంకు నుంచి రూ.4,800 విత్ డ్రా చేసారని ఆయన అన్నారు. భర్త శస్త్ర చికిత్స కోసం స్టేట్ బ్యాంకులో దాచుకున్న వాసిరెడ్డి సుభాషిణి అనే గృహిణి ఖాతానుంచి 25న రూ.10వేలు, రూ.2 వేలు, 26న రూ.8 వేలచొప్పున విత్ డ్రా చేయగా ఆమెకూడా పిర్యాదు చేశారు. బలిజిపేట మండలానికి చెందిన పడాల లక్ష్మణరావు ఖాతానుండి 5, 500రూపాయల డ్రా చేసారని ఆయన తెలిపారు. దీనిపై పోలీస్ యంత్రాంగం, సైబర్ పోలీసు యంత్రాంగం దృష్టి సారించి బాధితులకు న్యాయంచేయాలని వారంతా కోరుతున్నారు. నిందితులను పట్టుకుని ఖాతాలనుండి మాయమైన డబ్బులు తిరిగి ఇప్పించే చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

ఆత్మహత్య చేసుకున్న లెక్చరర్ కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలి

ప్రైవేటు లెక్చరర్ల అసోసియేషన్ విశాఖ జిల్లా అధ్యక్షుడు సురేష్ చౌదరి డిమాండ్

విశాలాంధ్ర-శృంగవరపుకోట: చాలీచాలని జీతంతో ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఇటీవల బలవన్మరణానికి పాల్పడిన ఉమ్మడి విశాఖ జిల్లా శృంగవరపుకోట మండలం, వినాయకపల్లి గ్రామానికి చెందిన ప్రైవేట్ అధ్యాపకుడు వెలుచూరి స్వామినాయుడు కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఉమ్మడి విశాఖ జిల్లా ప్రైవేట్ టీచర్స్ లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పి.సురేష్ చౌదరి డిమాండ్ చేశారు. మృతి చెందిన లెక్చరర్ కుటుంబాన్ని శనివారం పరామర్శించి వారికి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా సురేష్ చౌదరి మాట్లాడుతూ కుటుంబ పెద్దను కోల్పోయిన లెక్చరర్ స్వామినాయుడు కుటుంబానికి అసోసియేషన్ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. సుదీర్ఘ కాలంగా ప్రైవేట్ అధ్యాపకుడిగా ఉన్న కారణంగా వారికి గ్రాడ్యువిటి వచ్చే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు. వారికి అన్ని విధాలుగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పానెం జయ కిషోర్ బాబు తోడుగా ఉంటారని వారి కుటుంబ సభ్యులకు తెలియజేసారు. ఇలాంటి సంఘటనలు పునరా వృతం కాకుండా ఇప్ప టికయినా ప్రభుత్వం స్పందించి ప్రైవేట్ విద్యా సంస్థలలో పని చేస్తున్న టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ కోసం ఒక కార్పొరేషన్ ఏర్పాటు చేసి వారికి అండగా ఉండాల్సిన అవసరం

ఎంతైనా వుంది అని, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వెంటనే స్పందించి మృతుని కుటుంబానికి 10 లక్షలరూపాయలు ఎక్స్ గ్రేసియా ప్రకటించి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రైవేట్ అధ్యాపకుల హక్కుల కోసం పోరాడటానికి ముందడుగు వేసిన అసోసియేషన్ తో టీచర్స్ అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. అందరం కలిసికట్టుగా ఉంటే...అప్పుడు ఇలా జీవితా లను అర్ధంతరంగా ముగించే పరిస్థితులు లేకుండా సమస్యలను ధైర్యంగా ఎదుర్కొనగలమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సురేష్ చౌదరితో పాటుగా జిల్లా జనరల్ సెక్రటరీ కె.గోపికృష్ణ, ఇంచార్జ్ పూర్ణ, నాయుడు, హరి, గిరీష్, శివ తదితరులు పాల్గొన్నారు.

అశేష భక్త జనవాహిని మధ్య ఘనంగా ఖాదర్ బాబా జయంతోత్సవం

- బాబాకు చాదర్ సుగంధ సమర్పణ
- భారీ కేక్ కటింగ్.. దివ్యన్న సమారాధన

విశాలాంధ్ర-విజయనగరంటౌన్: ప్రముఖ సూఫీ ఆధ్యాత్మిక పుణ్య క్షేత్రం బాబామెట్టలో శనివారం సూఫీ సెహన్షా, సద్గురు హజరత్ సయ్యద్ బాబా ఖాదర్ వలీ 126వ జయంతోత్సవం ఘనంగా జరిగింది. ఖాదర్ బాబా దర్గా దర్బార్ షరీఫ్ ముతవల్లి(ధర్మకర్త) డాక్టర్ ఎండీ ఖలీలుల్లా షా తాజ్ ఖాదరీ సాబిరీ నేతృత్వంలో జరిగిన ఈ వేడుకలకు అలుపెరుగని అన్నదాత, మహా మాన వీయులు, సూఫీ సూరీడు హజరత్ అతావుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరీ బాబా దర్గా, దర్బార్ షరీఫ్(చీమల పాడు) పీఠాధిపతి పీర్జదా ముహమ్మద్ ఖాజా మోహియుద్దీన్ షా తాజ్ ఖాదరీ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రత్యేక ప్రార్థనలు చేసి బాబా జయంతోత్సవాలను ప్రారంభించారు. చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని వేలాది మంది హిందూ భక్తులు ఖాదర్ బాబా దర్గా దర్బార్ కి బారులు తీరారు. బాబా వారికి ప్రత్యేక ప్రార్థనలు చేసి, మధ్యాహ్నం నిర్వహించిన లంగర్ ఖానాలో దివ్యన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ వేడుకల్లో నిర్విరామ ఖాదర్ బాబా సేవకులు, ప్రేమికులు, అతా ముహమ్మద్ నిజాముద్దీన్ నిజామీజానీ షా తాజ్ ఖాదరీ, సిద్దిక్, నయీమ్, డాక్టర్ అవసరాల శ్రీధర్, సీనియర్ జర్నలిస్ట్ ఎలిశెట్టి సురేష్, లింగాల రవికుమార్, దర్బార్ షరీఫ్ సేవా బృందం తదితరులు తమ సేవలను అందించారు. అదేవిధంగా ఖాదర్ బాబా భక్తుల తో పాటు ఆయన ప్రియ శిష్యులు హజరత్ అతావుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరీ బాబా అహ్లియా వారి శిష్య బృందాలు హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, తిరుపతి, తెనాలి, మార్టూరు, పేరిచర్ల, ఒంగోలు, ఖమ్మం, జంపనీ, విశాఖపట్నం, చీమలపాడు, జుజ్జూరు, అల్లూరు, కొత్త గూడెం తదితర రాష్ట్ర నలుమూలల నుంచి, దేశ విదేశాల నుంచి తరలి వచ్చి ఈ వేడుకల్లో పాల్గొన్నారు. నగరానికి చెందిన ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు తదితరులు దర్గా దర్బార్ కి విచ్చేసి బాబాకు ప్రార్థనలు చేశారు. శనివారం సాయంత్రం చీమలపాడు పీఠాధిపతి ఖాజా బాబు, విజయనగరం బాబా దర్గా దర్బార్ ధర్మకర్త ఖలీల్ బాబు ఆధ్వర్యంలో ముజావర్లు, భక్తులు ఖాదర్ బాబా దర్గాలో బాబాకు సుగంధ ద్రవ్యోచిత చాదర్, పూలు సమర్పించి విశ్వ శాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం దర్బార్ షరీఫ్ లో అశేష భక్త జనం మధ్య ఖాదర్ బాబా పుట్టిన రోజును పురస్కరించుకుని భారీ కేకును కట్ చేసి భక్తులకి దాన్ని ప్రసాదంగా పంచి, సర్వేజన సుఖినోభవంతు అని పీఠాధిపతి కాజల్ బాబు ఆశీర్వచనాలు అందించారు. అనంతరం రాత్రి 7 గంటలకు మొదలైన దివ్యన్న సమారాధన అర్ధరాత్రి వరకు కొనసాగింది. వేలమంది భక్తులకు లంగర్ ఖానాలో రుచికరమైన ఆహార పదార్థాలతో విందు నిర్వహించారు. టు టౌన్ సిఐ లక్ష్మణ్‌రావు నేతృత్వంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా వేడుకలు ఘనంగా జరిగాయి.

ఐటీడీఏ పీవో కి సామల అభినందనలు

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్: పార్వతీపురం మన్యం ఐటీడీఏ పీవోగా ఇటీ వల బాధ్యతలు చేపట్టిన యువ ఐఏఎస్ అధికారి సి విష్ణు చరణ్ ని శనివారం మర్యాదపూర్వకంగా కలిసి అభినంద నలు తెలియజేసినట్లు ఆంధ్రప్రదేశ్ ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం తెలిపారు. ఈ సందర్భంగా పార్వతీపురం ఐటిడిఏ పరిధిలో చదువుతున్న గిరిజన విద్యార్థులకు ఉన్నత విద్యా,ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు యుపిఎస్సీ, ఐఐటి, నీట్ తదితర పరీక్షలకు శిక్షణ అవకాశాలు కల్పించాలని కోరడం జరిగిందన్నారు. అదేవిధంగా పలు విద్యా రంగ విషయాలను ఐటీడీఏ పీవో దృష్టికి తీసుకువెళ్లగా చాలా సానుకూలంగా స్పందించారని సామల హర్షం వ్యక్తం చేశారు. ఈ సంద ర్భంగా విద్యారంగ అభివృద్ధికి తమ సంఘం సహకరిస్తుందని తెలియజేసినట్లు సామల పేర్కొన్నారు.

పెదభోగిలిలో కుటుంబ డాక్టరు కార్యక్రమం

విశాలాంధ్ర-సీతానగరం: మండలంలోని పెదభోగిలి గ్రామ సచివాలయంలో కుటుంబ డాక్టర్ విధానంను శనివారం సీతానగరం పి హెచ్ సి డాక్టర్ నీలిమ ప్రసూజ అధ్వర్యంలో నిర్వహించారు. 104 వాహనంపై ఆమె సీతానగరం పి.హెచ్.సి నుండి పెదబోగిల వెళ్లి కార్యక్రమంను నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా పలువురు రోగులకు తనిఖీలు చేశారు.మధ్యాహ్నం పూట నిర్దేశిత గృహాలను,పాటశాలలను, అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి పలు సూచనలు,సలహాలు పాటించాలని సూచించారు.నెలలో రెండుసార్లు గ్రామాలకు పీహెచ్‌సీ డాక్టర్లు 104 వాహనంతోవెళ్లి,తమకు కేటాయించిన సచివాలయాలను నెలలో రెండు సార్లు సందర్శిస్తారనీ,104 మొబైల్ మెడికల్ యూనిట్(ఎంఎంయూ)తో పాటు గ్రామానికి వెళ్లి రోజంతా అక్కడే ఉండి ప్రజలకు వైద్యసేవలు అందచేస్తామనీ, అంగన్‌వాడీ స్కూళ్లు, ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు వైద్య సేవలు అందిస్తామని వైద్యులు నీలిమ చెప్పారు.ఫ్యామిలీ డాక్టర్ విధానంలో విలేజ్ క్లినిక్స్ కీలక పాత్ర పోషిస్తాయన్నారు సీహెచ్‌వో, ఏఎన్ఎంఆశాలు ముందురోజే ప్రజలకుదేనిపై సమాచారం అందజేస్తారని తెలిపారు. బాలింతలు,గర్భిణులు, సాంక్రమిక, అసాంక్రమిక సమస్యలతో బాధపడే వారికి వైద్య సేవలు అందేలా చూస్తామన్నారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈకార్యక్రమంలో 104వైద్యులు వంశీ, సచివాలయ ఉద్యోగి కుమారి, 104వాహన సిబ్బంది, వైద్య సిబ్బంది, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

తక్షణమే ఇంటి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించాలి

విశాలాంధ్ర-గజపతినగరం: కొత్తగా మంజూరైన ఇళ్లకు సంబంధించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించాలని జడ్పిటిసి తవుడు అన్నారు గజపతినగరం మండల పరిషత్ కార్యాలయంలో శనివారం గృహ నిర్మాణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గజపతి నగరం మండలంలోని 722 కొత్తగా ఇల్లు మంజూరైనట్లు చెప్పారు ముందుగా నిర్వహించే రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు అనంతరం ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు ఈ సమావేశంలో గృహ నిర్మాణ శాఖ డి ఈ సత్యనారాయణ ఎంపీడీవో కొవ్వాడ కిషోర్ కుమార్ హౌసింగ్ ఏఈ శామ్యూల్ వైసీపీ నాయకులు త్రినాధ రావు పాల్గొన్నారు

వలంటీర్ల పోస్టులకు ఇంటర్వ్యూలు

విశాలాంధ్ర-భోగాపురం: భోగాపురం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శనివారం వాలంటీర్ల ఇంటర్వ్యూలు నిర్వహించారు. రావాడ - 1, పోలిపల్లి-1, చాపలకంచెరు-1, కొండరాజుపాలెం-1, రామచంద్రపేట-1 మొత్తం 05 వాలంటీర్ల ఖాళీలకు గాను, ఏడుగురు అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు, ఎంపికైన అభ్యర్థులకు నియామక ఉత్తర్వులు అందజేస్తామని ఎంపీడీవో బంగారయ్య తెలిపారు.

సచివాలయాల్లోని భవనాలు త్వరితగతిన నిర్మాణాలు చేయండి : ఎంపీడీఓ రెడ్డి

విశాలాంధ్ర-సీతానగరం: మండలంలోని పలు గ్రామాల్లోని సచివాలయాల్లో నిర్మిస్తున్న గ్రామసచివాలయాలని, రైతు భరోసా కేంద్రాలను, వెల్ నెస్ కేంద్రాల నిర్మాణాలను వేగవంతంగా పూర్తిచేయాలని కోరారు. శనివారం ఆయన మండలంలోని పలు గ్రామాల్లోని జరుగుతున్న నిర్మాణాలు పరిశీలించి అక్కడే ఉన్న ప్రజా ప్రతినిధులు, గుత్తేదారులు, ఇంజినీరింగ్ సహయాకులతో మాట్లాడి నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని కోరారు. దీంతో పాటు గ్రామాల్లో జగనన్న కాలనీలో ఇళ్ళను, వ్యక్తిగతంగా నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణాలను కూడా వేగవంతంగా పూర్తిచేయాలని కోరారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని కోరారు.సమయ పాలన పాటిస్తూ సచివాలయంలో సిబ్బంది, వాలంటీర్లు అందుబాటులో దీంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైనలబ్ధిదారులకు అందజేసేందుకు కృషి చేయాలని కోరారు.ఇదిలా ఉండగా గ్రామాలలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటుహక్కు కోసం అర్హతకలిగిన వారు సత్వరమే సంబంధిత ధృవీకరణ పత్రాలను జతపరిచి దరఖాస్తు చేసుకొనేలా సచివాలయం సిబ్బంది దృష్టి పెట్టాలని కోరారు. ఆయనతో పాటు పరిపాలన అధికారి ప్రసాద్, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్ ఎన్నికల ఓటరు నమోదులో భాగస్వామ్యంకండి

రాజకీయ పార్టీల నేతల సమావేశంలో తహశీల్దార్ ఎన్వీ రమణ పిలుపు

విశాలాంధ్ర-సీతానగరం: గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటరుగా అర్హులైన గ్రాడ్యుయేట్ అభ్యర్థులు నమోదు చేసుకోనేల వివిధ రాజకీయపార్టీల నేతలు దృష్టి సారించాలని తహశీల్దార్ ఎన్వీ రమణ పిలుపునిచ్చారు.శనివారం ఆయన మండలంలోని వివిధ రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. నవంబర్ 7లోగా అర్హులైన గ్రాడ్యుయేట్ అభ్యర్థులు ఓటుహక్కును నమోదు చేసుకోవాలని కోరారు. గతంలో ఉండే గ్రాడ్యుయేట్లకు ఉండే ఓటుహక్కును రద్దుచేయడం జరిగినందున ప్రతీఒక్కరు కూడా కొత్తగా నమోదు చేసుకోవాలని కోరారు.డిగ్రీ, ఇంజనీరింగ్, డిగ్రీకి సమానమైన డిప్లొమా, ఓపెన్ డిగ్రీ, ఎంబీబీఎస్, అగ్రికల్చర్, ఆయుర్వేదిక్ డిగ్రీపట్టభద్రులు అర్హులని చెప్పారు.ఈఓటుహక్కు నమోదుకు ఫారమ్-18, డిగ్రీ ప్రొవిజనల్ సర్టిఫికెట్ లేదా డిగ్రీ ప్రొవిజనల్ సర్టిఫికెట్ (అటెస్టెడ్), ఆధార్ కార్డు మరియు ఓటర్ ఐడి, పాస్ పోర్ట్ సైజ్ ఫోటోఒకటి కలిగిఉండి దరఖాస్తు లను ఆర్డీవో లేదా ఎమ్మార్వో కార్యాలయంలో లేదా ఎంపిడిఓ కార్యాలయంలో సంబంధిత పత్రాలు జతచేసి అందజేయాలన్నారు.మరిన్ని వివరాలకు ఆర్ డి ఓ కార్యాలయము లేదా తహశీల్దార్ కార్యాలయం లేదా ఎంపిడిఓ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. ఇప్పటికే సాధారణ ఓటుహక్కు కలిగినవారు తమ ఓటుకు ఆధార్ అనుసంధానం చేసుకోవాలని కోరారు. రాజకీయ పార్టీల నాయకులు కూడా దీనిపై విస్తృతంగా ప్రచారంచేసి ఓటుహక్కు నమోదు చేయించాలని కోరారు.ఈకార్యక్రమంలో వైఎస్సార్సీపీ నుండి బొంగు చిట్టిరాజు, ఈశ్వర నారాయణ, ఆర్వీ పార్థసారథి, టిడిపి నుండి కొల్లి తిరుపతిరావు, సాల హరి గోపాల్, సీపీఎం నుండి రెడ్డి ఈశ్వర రావు, బీజేపీ నుండి బాలా యాదవ్ తదితరులతోపాటు డిప్యూటి తహశీల్దార్ షేక్ ఇబ్రహీం, ఆర్ ఐ రాజేష్, సీనియర్ అసిస్టెంట్ కిరీటి పాల్గొన్నారు.

ఇంటింటి సమస్యల పరిష్కారానికే గడపగడపకు...

ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

విశాలాంధ్ర-వేపాడ: గ్రామాల్లో ప్రతి ఇంటింటికీ వెళ్ళి సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి ప్రవేశ పెట్టారని శృంగవరపుకోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని నీలకంఠ రాజపురం గ్రామంలో శనివారం 3వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు.ఈ సందర్భంగా కడుబండి ప్రతి గడప గడపకు వేళ్ళి వారి సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించి వారికి అందుతున్నది లేనిది ఆరా తీశారు.ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని మహిళా లబ్ధిదారులు చెప్పడంతో ఎమ్మెల్యే కడుబండి ఆనందం వ్యక్తం చేస్తూ ఇలాంటి సంక్షేమ పథకాలు మరికొన్ని అందాలంటే రాష్ట్రంలో వైఎస్ జగన్మోహనరెడ్డిని మరలా సీఎంగా చేసుకునే బాధ్యత ప్రతీ ఒక్కరి భుజస్కందాలపై ఉందని ఆయన అన్నారు. అలాగే నిరుపేదలు మహిళాభివృద్ధికి రైతు సంక్షేమానికి జగన్ మోహన్రెడ్డి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని ఎమ్మెల్యే గృహస్తులకు వివరించడం విశేషం.అలాగే ఈ ప్రాంత అభివృద్ధిని కోరుతూ విశాఖ రాజధానిగా సీఎం ప్రతిపాదించడం చెప్పుకోదగ్గ విషయమని దీనిని ప్రతిపక్షాలు అడ్డుకోవడం ఎంతవరకు న్యాయమో ప్రజలందరూ గ్రహించాలని సూచించారు.విశాఖ రాజధాని అయితే ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధితో పాటు ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని అలాగే ఆర్థిక అభివృద్ధి చెందవచ్చని ఆయన ప్రజల దృష్టికి తీసుకువెళ్లారు.గ్రామానికి చెందిన పలువురు యువకులు ఇంటింటి కొళాయిలు గ్రామాభివృద్ధి గ్రంథాలయం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఇప్పటికే గ్రామంలో ఇంటింటి కొళాయిల ఏర్పాటు పనులు చురుగ్గా సాగుతున్నాయని యువకులు దృష్టికి తీసుకెళ్లడంతోపాటు సీసీ రోడ్ల నిర్మాణానికి జనవరిలో నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.అలాగే గ్రంథాలయం ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించి గ్రంథాలను ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. నేటి వరకు ఏ ఎమ్మెల్యే అయినా ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకోవడం జరిగిందా ఈ ముఖ్యమంత్రి ప్రతి ఇంటికి వెళ్లి సమస్యలు తెలుసుకోమని పంపించడం అభినందించాల్సింది పోయి విమర్శలకు దిగడం సరైన విధానం కాదని హితవు పలికారు.ఇటువంటి కార్యక్రమాలు చేపట్టిన ముఖ్యమంత్రిని యువత ఆదర్శంగా తీసుకొని మరింత ప్రోత్సాహంతో గ్రామాల అభివృద్ధికి కంకణం కట్టాలని యువతకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ వేచలపు వేంకట చినరామునాయుడు,ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు (సతీష్) వైస్ ఎంపీపీ అడపా ఈశ్వరరావు మండలపార్టీ అధ్యక్షుడు ముమ్ములూరి జగ్గీబాబు కోపరేటివ్ అధ్యక్షులు వేచలపు రామ్మూర్తినాయుడు, గ్రామ సర్పంచ్ గొటివాడ దేవి ఉపసర్పంచ్ ఖండిపల్లి పెద నాయుడు నాయకులు గండి శ్రీరామమూర్తి, మురిపిండి గంగరాజు, భోజంకి రామానాయుడు గోకేడ సత్యంనాయుడు రావాడ వెంకటరావు బుద్ద కృష్ణ చీపురుపల్లి వేంకటరమణ కార్యకర్తలు సచివాలయ సిబ్బంది వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

రోజువారీ జామి మార్కెట్‌కు దశ తిరిగేనా?

- నిర్మాణానికి రూ.10లక్షలు ఇస్తామని జెడ్పీ చైర్మన్ హామీ
- రూ.25లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న పంచాయతీ

విశాలాంధ్ర-జామి: ఏన్నో ఏళ్ళగా మండల కేంద్రమైన జామిలో రోజువారీ కూరగాయాల మార్కెట్ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం స్థానిక వైసీపీ పెద్దలు తీవ్రంగా కృషి చేస్తున్నారు. అందులో భాగంగా స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న వారపు సంతను ఆధునీకరించేందుకు జిల్లా పరిషత్ చైర్మన్ సహాయాన్ని తీసుకుంటున్నారు. ఈవారపు సంతను రోజువారీ మార్కెట్‌గా తీర్చిదిద్దేందుకు ఇప్పటికే స్థానిక పంచాయితీ, మండల పరిషత్ పాలక వర్గాలు అనేక సార్లు ప్రతిపాదనలు తయారు చేసారు. ఎట్టకేలకు రెండు రోజుల క్రితం జామి మండల సమావేశానికి వచ్చిన జిల్లా పరిషత్ చైర్మన్ చిన్న శ్రీను దృష్టికి స్థానిక నేతలు అల్లు పద్మ, అల్లు సత్యాజీ, మండల వైసీపీ కన్వీనర్ గొర్లె రవికుమార్ తదితరులు తీసుకువచ్చారు.

వెంటనే ప్రతిపాదనలు తయారు చేయాలని చిన్న శ్రీను ఆదేశాలు ఇచ్చారు. సంతను నిర్మాణం చేసేందుకు మొత్తం రూ.25లక్షలు అంచనాగా చెప్పగా జెడ్పీ నుంచి రూ.10లక్షలు ఇస్తామని, స్థానిక పంచాయతీనుంచి రూ.10లక్షలు, ఎమ్మెల్యేలేదా ఎంపి,మండల పరిషత్‌ల నుంచి మిగిలినరూ.5లక్షలను మంజూరు చేయించుకోవాలని చైర్మన్ సూచించారు. దీనికి స్థానిక పంచాయతీ పాలకులు సిద్ధమయ్యారు. దీంతో రోజువారీ మార్కెట్‌కు సమస్యలు తొలగిపోతాయనే నమ్మకం స్థానిక ప్రజలలో ఏర్పడింది. త్వరలోనే టెండర్ ప్రక్రియను పూర్తి చేసేందుకు చర్యలు చేపడతామని వైసీపీ పెద్దలు చెబుతున్నారు.

విక్టర్ ప్రసాద్ పై వ్యాఖ్యలు అమానుషం

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాదు పై దేశద్రోహి అని అనుచిత వ్యాఖ్యలు చేయడం అమానుషమని అటువంటి వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని సమతా సైనిక్ దళ్ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షులు కుప్పిలి బాబాజీ, ప్రధాన కార్యదర్శి బాబురావు ఉపాధ్యక్షుల వాసు సలహాదారుల యమ్మల జనార్దనరావు అన్నారు.పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడులో జరిగిన సమావేశంలో మారుమూడి విక్టర్ ప్రసాద్ హాజరయ్యారని 1932 లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఓటు హక్కు ఎవరికి ఇవ్వాలనే విషయంపై చర్చించడం జరిగిందని దేశంలో ప్రతి పౌరులు మహిళలకు హక్కులు సమాన అవకాశాలు కల్పించాలన్న విషయాన్ని ప్రసాద్ చర్చించిన అంశంపై అగ్రవర్ణాలకు చెందినవారు మారుమూడి విక్టర్ ప్రసాద్ పై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఇటువంటి వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు.

పుణ్యగిరి శివాలయానికి ఆకాశదీపం, దారాపాత్ర సామగ్రి బహూకరణ

ఎమ్మెల్సీ రఘురాజు దంపతులచే అందజేత

విశాలాంధ్ర-శృంగవరపుకోట: జిల్లాలో ప్రముఖ శైవక్షేత్రంగా విరాజిల్లుతున్న ఎస్.కోట శివారు పుణ్యగిరి దేవస్థానానికి ఆకాశ దీపం, దారాపాత్ర సామాగ్రిని స్టోన్ క్రషర్ అధినేత ఏ.ఎన్.వెంకటరావు, అతని తండ్రి ప్రసాద రావులు ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, సుధారాజు దంపతుల చే ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ రామకృష్ణ, ఈఓ నాగేంద్ర ప్రసాదులకు శ్రీదారగంగమ్మ అమ్మవారి ఆలయఆవరణలో శనివారం అందజేశారు. ముందుగా శ్రీదార గంగమ్మ అమ్మవారిని ఎమ్మెల్సీ రఘురాజు దంపతులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ పుణ్యగిరి శివాలయానికి వేల రూపాయల ఖరీదుచేసే పూజా సామాగ్రిని బహూకరించిన ప్రసాదరావు, వెంకటరావుల్ని అభినందించారు. కార్యక్రమంలో పుణ్యగిరి దేవస్థానం చైర్మన్ పొలమరశెట్టి రామకృష్ణ మెంబర్లు, దేవస్థానం సిబ్బంది, శ్రీరాములు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

భక్తి ప్రపత్తుల నడుమ వాడవాడలా నాగులచవితి పండుగ

విశాలాంధ్ర-సీతానగరం: మండలంలోని అన్నిగ్రామాల్లో నాగుల చవితి పండుగను భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. దీపావళి అమావాస్య తరువాత వచ్చే కార్తీక శుద్ధ చతుర్థిని నాగుల చవితి పండుగగా జరుపుకుంటాము. నాగుల చవితి సందర్భంగా పుట్టకు ఉపవాస దీక్షతో ఉండి భక్తి శ్రద్ధలతో పూజలు చేస్తారు.ప్రకృతి మానవ మనుగడకు జీవనాధారమైనది కనుక దానిని దైవస్వరూపంగా భావించి పూర్వీకులు చెట్టును, పుట్టను, రాయిని, రప్పను, కొండను, కోనను, నదిని, పర్వతాన్ని, ఇలా సమస్త ప్రాణికోటిని దైవస్వరూపంగా చూసుకొంటూ పూజిస్తూవస్తున్నారు. అందులో భాగంగానే నాగుపామును కూడా నాగరాజుగా, నాగదేవతగా పూజిస్తూ వస్తున్నారు.ఇంటిల్లపాది సభ్యులంతా కలిసి పొలాల్లో ఉండే పుట్టవద్దకు చేరుకొని అక్కడ నాగ దేవుడికి పూజలు నిర్వహించారు. నూలుముద్ద, గుడ్లు, పత్రి, పాలుతో నాగేంద్రుడుకి పుట్టలువద్ద పూజలు చేయడంవల్ల పంటలు బాగా పండుతాయని, ఆయురా రోగ్యాలు ఉంటాయని, కుటుంబాలకు మంచి జరుగుతుందని పూజల ప్రగాఢ నమ్మకం. పూజ అనంతరం పుట్ట మన్నును చెవులకు పుట్ట బంగారంగా అలంకరణ చేసుకుంటారు. నాగులచవితి రోజున నాగదేవతని పూజించడం వల్ల సర్పదోషాలు తొలగిపోతాయని,ముఖ్యంగా కుజ దోషము, కాలసర్ప దోషాలు ఉన్నవారు నాగులచవితి రోజున, కాలసర్పదోషానికి అధిపతి అయిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని పూజించుకుంటే మంచి ఫలితాలు కూడా వస్తాయని పలువురు తెలిపారు. ఇక నాగుల చవితి పండుగ రోజున మహిళలు విశేషంగా పుట్టలో పాలు పోసి, ఉపవాస దీక్షను ఆచరిస్తారు. నాగల చవితి పండుగ రోజున అందరూ తమ కుటుంబం సంతోషంగా ఉండాలని, శ్రేయస్సుతో ఉండాలని భావించి నాగ దేవతకు పూజాదికాలు నిర్వహిస్తారు. నాగల చవితి పండుగ రోజున నాగ దేవతను పూజిస్తే సర్వరోగాలు తొలగిపోతాయని భక్తులు విశేషంగా నమ్ముతారు. అంతేకాదు నాగులచవితి నాడు నాగదేవతను ఆరాధిస్తే సంతానం లేని వారికి సంతానం కలుగుతుందని కూడా భక్తులు ప్రగాఢంగా నమ్ముతారు. నాగల చవితిపండుగ రోజున నాగేంద్రుడు పరమేశ్వరుడికి వాసుకి గా, శ్రీమహా విష్ణువుకి ఆదిశేషునిగా మారి తోడుగా ఉంటాడని నమ్ముతారు.అందుకే ఈరోజున నాగేంద్రుడిని పూజించడం అంటే అటు శివుడికి, ఇటు విష్ణువుకు పూజ చేసినంత ఫలితం ఉంటుందని భక్తులు ఎక్కువమంది నమ్ముతారు. రైతులు పంట పొలాల్లో నాగేంద్రునికి పూజలు చేయడం వల్ల పంటలు బాగా పండుతాయని విశ్వసిస్తారు. చాలా గ్రామాలలో కుటుంబాలన్నీ కలిసికట్టుగా వెళ్లి పూజలు చేయడం గమనార్హం. కార్తీక మాసంలో నాగులచవితి, కార్తీక పౌర్ణమి పండుగలను ప్రత్యేక శ్రద్ధతో నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని పలువురు పెద్దలు, మహిళలు తెలిపారు. ఇప్పుడు మహిళలతో పాటు అయ్యప్ప స్వాములు, శివ స్వాములు కూడా పెద్ద ఎత్తున గ్రామాలలో మాలధారణ చేయడంతో గ్రామాలలో ఆధ్యాత్మిక భావన స్పష్టంగా కనిపిస్తుంది. కార్తీక మాసంలో వాడ వాడలా అన్ని వర్గాల్లో భక్తి శ్రద్ధలతో పూజలు చేయడం కనిపించడం గమనార్హం.

భక్త శ్రద్ధలతో నాగుల చవితి

విజయనగరంటౌన్ : జిల్లాలో శనివారంనాగులచవితి పండుగను భక్తులు భక్తి శ్రద్ధలతో జరుపుతున్నారు. ఉదయం నుండి పది గంటల వరకు నిర్ణయించిన ముహూర్త సమయంలో కుటుంబ సమేతంగా నూతనవస్త్రాలు ధరించి సమీపంలో పుట్టలవద్ద నాగన్నలకు పూజలు నిర్వహించారు.పాలు ,చలిమిడి, చిమ్మిలి, కోడిగుడ్లు ఆహారంగా పుట్టలలో వేసి ఆరాధనతో నమస్కారాలు చేసారు. తమకుటుంబంలో వారికి నాగదోషాలుతగలనీయరాదని నాగజాతిని వేడుకు న్నారు. పుట్టమన్ను సేకరించి చెవులకు పెట్టుకున్నారు.ఆవిధంగా చేయడం వలన చెవి సంబంధిత వ్యాధులు దరిచేరవని భావిస్తారు. రైతన్నలు ఏడాదిపొడవునా తమపొలాలలో క్రిమికీటకాలు ,ఎలుకలను నాశనంచేసి తమపంట కు రక్షణ కల్పించడం, పుట్టల అంతర్భాగంలో నడయాడటం వల్ల నీటిని పరోక్షంగా సక్రమంగా ఉండేలా చేయగలవి పాములేన్న నమ్మకంతో క్రతజ్ఞతలు తెలిపుతూ నాగారాధనలు చేసారు.పలుగ్రామాలలో నాగులచవితి సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం పరిపాటి.

ఆహ్లాదకర వాతావరణంలో ...

గుమ్మలక్ష్మీపురం: పెద్దలు, పిల్లలు అందరూ కలిసి పుట్ట వద్దకు వెళ్లి పాలు పోసి పూజచేయడం మన ఆచారంలో భాగం. నాగుల చవితి నాడు పుట్టకు పూజ అనేది ఒక సంప్రదాయం. గుమ్మలక్ష్మీపురం మండలం లో ప్రజలు నాగుల చవితి వేడుకగా చేసుకున్నారు. పురాతన నామలేశ్వర స్వామి గుడి ని ఈమధ్య చక్కగాతీర్చి దిద్దారు. భక్తులు కోరిన కోరికలు తీర్చే గుడి గా నమ్మకం ఈ నామాల గుడి. ఈ రోజున నాగ దేవత కు నైవేద్యం సమర్పిస్తారు. నాగ దేవతకు తమ పంటను చల్లగా కాపాడమని కోరుకుంటారు. పాలు, గుడ్లు, పోసి పూజిస్తారు. చిన్న పిల్లలు పుట్ట గుడి వద్ద టపాసులు కాల్చి ఆనందంతో కేరింతలు కొట్టారు. పెద్దవాళ్ళు అందరూ తమ పిల్లలకు కుటుంబ సభ్యులకు పూజ విశేషాలు తెలియ జేస్తారు ఈ నాగుల చవితి నాడు.

ఎస్‌కోటలో భక్తిశ్రద్ధలతో పూజలు

శృంగవరపుకోట: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం నాగుల చవితి పూజలను ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఎస్.కోట, ధర్మవరం మేజరు పంచాయతీలతో పాటు వెంకటరమణపేట, బొడ్డవర, తిమిడి, కొట్టాం, సీతారాంపురం, కిల్తంపాలెం, పోతనాపల్లి, కొత్తూరు, వినాయకపల్లి తదితర గ్రామాల్లో ప్రజలు పుట్టలు వద్దకు వెళ్లి నాగదేవతకు పాలు, నీళ్ళు, కోడిగుడ్లు, చిమిడి వంటి నైవేద్యం సమర్పించారు. కాగా ఈ ఏడాది చవితి తిథి తగులు, మిగులుగా శుక్రవారం మధ్యాహ్నం నుండి శనివారం ఉదయం 10.46 గంటల వరకు ఉండటంతో మండల పరిధిలోని ఇంచుమించు అన్ని గ్రామాల్లో పలు కుటుంబాలు శుక్రవారం మధ్యాహ్నం చవితి పూజలు చేయగా మరికొన్ని కుటుంబాలు చవితి వేడుకలను శనివారం ఉదయం వైభవంగా జరుపుకోవడం విశేషం.

రామభద్రపురం : మండలంలోని 22 గ్రామపంచాయతీలలో శనివారము నాగుల చవితి పండగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉదయం ఉదయం 7 గంటల నుండి 10 గంటల మధ్యలో గ్రామ పొలిమేరలో ఉన్న పుట్ట వద్దకు వెళ్లి నాగ దేవతకు పసుపు కుంకుమలతో మహిళల పూజలు చేసి మొక్కులు సమర్పించుకున్నారు. చిన్నారులు పెద్దలు మహిళలు పుట్టలో పాలు గుడ్లు నువ్వుల ముద్ద చిల్లర నాణేలు వేశారు. అలాగే టపాసులు పేల్చి సందడి చేశారు.

నాగేంద్రుడికి ఘనంగా పూజలు

దత్తిరాజేరు : మండలములో గల పలు గ్రామాల్లో నాగులచవితి వేడుకలు ఘనంగా జరిగాయి. మరడాం, టి.బూర్జివలస, ఇంగిలాపల్లి, పెదమానాపురం, చుట్టు ప్రక్కల అన్ని గ్రామాల్లో ఉదయం నుండి భక్తులు భక్తి శ్రద్ధలతో పుట్టలో పాలు పోసి తమ మొక్కులను తీర్చుకున్నారు. పెద్ద ఎత్తున బాణా సంచాలు వెలిగించారు సంస్కృతి, సాంప్రదాయంలను పాటించారు సాయంత్రం నందమ్మాను ఊరిగించి పలు సంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు అనంతరం నందమ్మా అనుపోత్సవం జరిగింది.